సాక్షి ఒడిశా

గురువారం । 12 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,35,059
బంగారం	32 గ్రాముల 850 మిల్లీ గ్రాములు
వెండి	565 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

అలంకార రూపిణి..!



శోడష దినాత్మక పూజలు పురస్కరించుకుని జగన్మాత పలు శక్తి పీఠాల్లో నిత్య నూతనంగా వెలుగొందుతోంది.

- 8లో▸



బావిలో పడిన పిల్లిని రక్షించబోయి..!

పాడుబడిన బావిలో పడిపోయిన పిల్లిని రక్షించే ప్రయత్నంలో 50 ఏళ్ల వ్యక్తి నీటిలో మునిగి మరణించాడు.

- 8లో▸

న్యూస్‌రీల్

డిప్యూటీ కమిషనర్‌గా రమేష్



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



బాధ్యతలు చేపట్టిన రమేష్ హంసదా

బరంపురం: బరంపురం మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) డిప్యూటీ కమిషనర్‌గా రమేష్ హంసదా బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఉదయం బీఎంసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టి మేయర్ సంఘమిత్ర దొళాయితో కలిసి సమావేశ మందిరంలో ఓడీఆర్పీ సమీక్ష నిర్వహించారు. నగరంలో ఒడిశా డిజాస్టర్ రికవరీ ప్రాజెక్ట్ కింద రహదారులు, కాలువల నిర్మాణం మరియు మురికివాడల అభివృద్ధి కోసం 40 వార్డులకు డీపీఆర్ ప్రక్రియ పూర్తయ్యిందని వెల్లడించారు. వీటిలో కొన్ని వార్డుల కోసం టెండర్స్ పూర్తయ్యిందని, మరికొన్ని వార్డులకు టెండర్ ప్రక్రియ జరగాల్సి ఉందని చెప్పారు. మొత్తం టెండర్లు పూర్తయ్యాక పనులు ప్రారంభించనున్నట్లు తెలియజేశారు.

కుళ్లిపోయిన మృతదేహం లభ్యం



లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా జట్నీ పోలీసుస్టేషన్ పరిధిలో కుళ్లిపోయిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. స్థానిక రైల్వే లైన్ పక్కన బైరంగా గ్రామం సమీపంలో కనుగొనబడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖుర్దా జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించి జట్నీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.

గంజాయి స్వాధీనం



అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి చాటికొన రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు ఒక వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బిసంకటక్ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ ప్రిస్కా ఒర్హూ నేతృత్వంలో మంగళవారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో రైల్వేస్టేషన్ వద్ద ఒక వ్యక్తి రెండు సంచులు పట్టుకుని వెళ్తుండడంతో అనుమానించిన పోలీసులు సంచుల్లో తనిఖీలు నిర్వహించారు. దీంతో బ్యాగులో 14.400 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుడు మహారాష్ట్రకు చెందిన భాస్కర్ ఖాన్ (19)గా పోలీసులు గుర్తించారు. అతనిని విచారించగా ఫుల్బాణి జిల్లా నుంచి గంజాయిని మహారాష్ట్రకు తరలించేందుకు సన్నద్ధం చేస్తున్నట్లు అంగీకరించారు. నిందితుడిని అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించారు.

అంగన్‌వాడీ ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రంతో నాలుగు గ్రామాల ప్రజలు

జయపురం: తమ గ్రామాలకు అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని బొయిపరిగుడ సమితిలోని కొండాగుడ, రావుల్యగుడ, కదంబపాదర్, చెరకామ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు జయపురం సబ్ కలెక్టర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గ్రామాల్లో 45 కుటుంబాలకు చెందిన 170 మంది ప్రజలు నివసిస్తున్నారని వెల్లడించారు. ఈ గ్రామాలకు ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంతో కాలంగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే, రానున్న ఎన్నికలను తాము బహిష్కరిస్తామని హెచ్చరించారు.

అతివకు స్కూటీ యోజన



పర్లాకిమిడి: ప్రభుత్వం అందజేసిన స్కూటీతో మహిళ

- మిషన్ శక్తి స్కూటర్ యోజన ప్రారంభం
- వడ్డీ రహిత స్కూటీ రుణ సౌకర్యం
- సీఎం నవీన్ పట్నాయక్



రాయగడ: స్కూటీలతో స్వయం సహాయక బృందాల మహిళలు



పచ్చజెండా ఊపి మిషన్ శక్తి స్కూటర్ యోజన ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో మిషన్ శక్తి స్కూటర్ యోజన పథకాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘాల (డబ్ల్యూఎస్‌హెచ్‌జీ) సభ్యుల కోసం ఈ పథకం ప్రవేశపెట్టడం విశేషం. రాష్ట్ర రాజధానిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 100 మంది మహిళలకు మిషన్ శక్తి స్కూటర్ యోజన కింద స్కూటీల తాళాలు అందజేశారు. ముఖ్యమంత్రి పచ్చజెండా ఊపడంతో వీరంతా స్కూటర్లతో విధి నిర్వహణ రంగానికి బయల్దేరారు. ఈ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మంది మిషన్ శక్తి మహిళలు తమ స్కూటీలను అందుకున్నారు.

వడ్డీ రహిత రుణం

ఈ పథకం మిషన్ శక్తి సమాఖ్య నాయకులు మరియు కిందిస్థాయి అనుబంధ సిబ్బందికి వారు ఎంచుకున్న స్కూటర్ల కొనుగోలు కోసం రూ.1 లక్ష వరకు బ్యాంకు రుణం లభిస్తుంది. ఈ అప్పు పూర్తిగా వడ్డీ రహితం కావడం విశేషం. ఈ ప్రోత్సాహంతో క్షేత్ర స్థాయిలో పనులను చకచకా చక్కబెట్టేందుకు అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా సీఎం నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ.. మిషన్ శక్తిలో పాల్గొన్న మహిళల పనితీరు బాగుండడమే కాకుండా ప్రశంసనీయమన్నారు. మహిళా సాధికారత ప్రయాణంలో ఈరోజు కీలక ఘట్టమని పేర్కొన్నారు. మా తల్లులు వారి మిషన్ శక్తి స్కూటర్లను అందుకోవడంతో వారికి మద్దతునిచ్చే దిశగా మేము గణనీయమైన ప్రగతిని సాధించామని తెలియజేశారు. వచ్చే ఐదేళ్లలో ప్రభుత్వం ఉదారంగా రూ.528 కోట్ల వడ్డీ రాయితీని అందిస్తోందని వెల్లడించారు. 2 లక్షల మందికి పైగా మిషన్ శక్తి తల్లులు మరియు కింది స్థాయి సిబ్బంది దీని ద్వారా లబ్ధి పొందనున్నారని తెలిపారు. మిషన్ శక్తి కార్యదర్శి సుజాత కార్తికేయన్ మాట్లాడుతూ ఈ పథకం ప్రారంభం ఒక మైలురాయి అని అన్నారు. పంచాయతీ, మండలం మరియు జిల్లా స్థాయిలో దాదాపు 75 వేల మంది కిందిస్థాయి (కమ్యూనిటీ సపోర్టు) సిబ్బంది మరియు దాదాపు 1,25,000 మంది మిషన్ శక్తి నాయకులు ఈ పథకం నుంచి లబ్ధి పొందుతారని వెల్లడించారు. క్షేత్రస్థాయి విధి నిర్వహణ రంగంలో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం పెంపొందించడం, ప్రోత్సహించడం మరియు సంఘంలో తమ ఉనికిని విస్తరించడం మిషన్ శక్తి స్కూటర్ యోజన లక్ష్యంగా పేర్కొన్నారు.

మల్కన్‌గిరిలో...

స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద కలెక్టర్ విశాల్ సింగ్ అధ్యక్షతన మిషన్ శక్తి స్కూటర్ యోజన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మాఝి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు స్కుటార్ తాళాలను అందజేశారు. కార్యక్రమంలో చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, జిల్లా గిరిజన అభివృద్ధి సంఘ అధ్యక్షుడు అడ్మార్వా, మల్కన్‌గిరి ఎమ్మెల్యే ఆదిత్యా మాఢీ తదితరులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: మహిళలకు స్కూటర్ తాళాలు అందజేస్తున్న ఎంపీ రమేష్ మాఝి

పర్లాకిమిడిలో...

ముఖ్యమంత్రి స్కూటర్ యోజన కార్యక్రమాన్ని గజపతి కలెక్టర్ స్మృతి రంజన్‌ప్రధాన్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్, పర్లాకిమిడి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠిలు వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో మిషన్ శక్తి ఆధ్వర్యంలో మహిళా గ్రూపులకు స్కూటీల పంపిణీ పథకాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఒడిశా లివ్‌లీ హుడ్, మిషన్ శక్తి డైరెక్టర్ తిమాన్ బోరా, మధుస్మితా తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో...

మిషన్ శక్తి స్కూటీ పథకంలో భాగంగా జిల్లాలో 77 మందికి స్కూటీలను పంపిణీ చేశారు. కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు ఆమె చేతుల మీదుగా తాళాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి కామాక్షి పాఢి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నిహార్ రంజన్ కుహారో పాల్గొన్నారు.



పర్లాకిమిడి: మహిళా గ్రూపు సభ్యులకు స్కూటీలు అందజేస్తున్న దృశ్యం

కేకే రైల్వేలైన్ పునరుద్ధరణ



అందుబాటులోకి వచ్చిన రైల్వేలైన్

కొరాపుట్: దాదాపు 16 రోజుల అనంతరం కొత్తవలస–కిరండోల్ రైల్వేలైన్ పునరుద్ధరణ జరిగింది. బుధవారం నుంచి గూడ్స్ రైళ్లు ముందుకు సాగాయి. సెప్టెంబర్ 24వ తేదీన కొరాపుట్ సమీపంలో మనబర్–జంత్రి రైల్వేస్టేషన్ల మధ్య మట్టి కొండ ముందుకు జరిగి పట్టాల మీదకి చొచ్చుకు వచ్చింది. దీంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. వందల మంది కార్మికులు, అనేక జేసీబీలు రాత్రింభవళ్లు పనిచేసి మట్టిని తొలగించారు. ఈస్ట్ కోస్ట్ జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, వాల్తేర్ డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్‌లు స్వయంగా సంఘటన స్థలంకి వచ్చి పునరుద్ధరణ పనులు పర్యవేక్షించారు. వాల్తేర్ డివిజన్‌లో ఈ మార్గం ఆర్థికంగా గుండె వంటిది. నేషనల్ మైనింగ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతిరోజు కిరండోల్, బచేలి నుంచి ముడి ఇనుప రజను ఈ మార్గం గుండా తరలిస్తుంది. తద్వారా ప్రతి రోజు సుమారు రు.50 కోట్లు అద్దె చెల్లిస్తుంది. ప్రస్తుతం 16 రోజుల ఈ రవాణా నిలిచిపోవడంతో రైల్వేశాఖ భారీగా నష్టపోయింది. గూడ్స్ రైళ్లు పునరుద్ధరణ జరిగినప్పటికీ ప్రయాణికుల రైళ్ల పునరుద్ధరణపై ఇంకా అధికారులు తుది నిర్ణయం తీసుకోలేదు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు



కుసుమ పూజారి మృతదేహం

జయపురం: పట్టణ పోలీసుస్టేషన్ పరిధి డొంగాగుడ గ్రామంలో భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో డొంగాగుడ గ్రామంలో ఒక మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. అయితే సాయంత్రం 4 గంటల వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. అనంతరం 4.30 గంటల సమయంలో డొంగాగుడ గ్రామానికి చెందిన దాము పోరజ వచ్చి తన తల్లి కుసుమ హరిజన్ ఉరఫ్ కుసుమ పూజారి (56)ను, తన మారటి తండ్రి భగత్ హరిజన్ హత్య చేసినట్లు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం నవరంగ్‌పూర్ నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించామన్నారు. త్రిభుజ మహాలిగ నేతృత్వంలో క్లూస్ టీమ్‌తో పాటు తాము దర్యాప్తు జరుపుతున్నామని తెలియజేశారు. దాము పొరజ ఫిర్యాదు ప్రకారం భగత్ హరిజన్(63)ను బొరిగుమ్మ లో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే కుసుమ పూజారి హత్యకు వినియోగించిన కట్టెను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు జరుగుతుందని వెల్లడించారు

సెంచూరియన్ ఆధ్వర్యంలో 'కృషిమేళా'



కృషిమేళాలో పాల్గొన్న వర్సిటీ విద్యార్థులు, రైతులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ సమితి గండాహతి గ్రామంలో సెంచూరియన్ వర్సిటీ ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ విద్యాలయం సిబ్బంది, విద్యార్థులు, రైతులతో 'కృషిమేళా' కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా సుమారు 200 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం, మట్టి పరీక్షలు, కీటకాల నిర్మూలనతో అధిక దిగుబడులపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ నందా మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రామాల అభివృద్ధి కోసం అభ్యసించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో సెంచూరియన్ వెటర్నరీ స్కూల్ డీన్ డా.ఆర్.కె.స్వయిం, డా.ఆశీర్వచస్ మహాపాత్రో, డాక్టర్ బిశ్వజిత్ సాహు, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో సీఎం పర్యటన నేడు

- లక్ష్మీ బస్సులకు శంకుస్థాపన చేయనున్న సీఎం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న లక్ష్మీ బస్సులు



స్టేడియం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ప్రణప్రకాష్ దాస్

మల్కన్‌గిరి: జిల్లాలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం పర్యటించనున్నారు. దీనిలో భాగంగా భువనేశ్వర్‌లో గురువారం ఉదయం 9.30 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి, ఉదయం 9.35 గంటలకు బిజు పట్నాయిక్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. 9.40 గంటలకు విమానంలో బయల్దేరి 10.30 గంటలకు జయపురం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అనంతరం అక్కడ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో 10.45 గంటలకు బయల్దేరి 11.30 గంటలకు మల్కన్‌గిరి ఎంవీ 3 గ్రామం వద్దనున్న బీఎస్ఎఫ్ హెలీప్యాడ్ వద్ద దిగుతారు. అక్కడ నుంచి స్థానిక స్టేడియం వద్దకు 11.35 గంటలకు చేరుకొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు లక్ష్మీ బస్సులను ప్రారంభిస్తారు. కార్యక్రమాలు అనంతరం ముఖ్యమంత్రి తిరిగి మధ్యాహ్నం 12.30 గంటలకు మల్కన్‌గిరి నుంచి బయల్దేరి 1.15 గంటలకు జయపురం చేరుకుంటారు. అనంతరం అక్కడ నుంచి 1.30 గంటలకు విమానంలో బయల్దేరి 2.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటారు.

ప్రత్యేక ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం రాష్ట్ర బీజేడీ కార్యదర్శి ప్రణప్రకాష్ దాస్ మల్కన్‌గిరి చేరుకొని ముందుగా భైరవీ అమ్మవారి దర్శనం చేసుకొని, పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. సరిహద్దుల్లో వాహన తనిఖీలు విస్తృతం చేశారు.

గాల్లోకి కరెన్సీ నోట్లు

- ఆర్‌బీఐ కార్యాలయం వద్ద కస్టమర్ల వినూత్న నిరసన



ఆర్‌బీఐ కార్యాలయం ఆవరణలో నేలపై పడి ఉన్న కరెన్సీ నోట్లు

భువనేశ్వర్: సిబ్బందితో వాగ్వాదం వలన వినియోగదారులు కరెన్సీ నోట్లు గాల్లోకి విసిరిన విచిత్ర ఘటన స్థానిక భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కార్యాలయం ఆవరణలో బుధవారం చోటుచేసుకుంది. పలువురు వ్యక్తులు చిరిగిన మరియు తడిసిన ఇతరేతర కారణాలతో పాడైన నగదు నోట్లను మార్చి, కొత్త నోట్లు తీసుకునేందుకు రిజర్వ్ బ్యాంకును సందర్శించారు. అయితే చెడిపోయిన నోట్లను మార్చుకునేందుకు బ్యాంకు అధికారులు నిరాకరించడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. తీవ్ర నిరుత్సాహానికి గురైన వినియోగదారులు తమ దగ్గర అక్కరకు రాకుండా ఉన్న నగదు నోట్లను గాలిలోకి రువ్వి వినూత్న రీతిలో నిరసన ప్రదర్శించారు. ఫలితంగా రూ.100, రూ.200, రూ.500ల విలువైన చెడిపోయిన కరెన్సీ నోట్లు అర్‌బీఐ కార్యాలయం ఆవరణ మరియు ఎదురుగా ఉన్న వీధిలో పడి ఉండడంతో అసాధారణ పరిస్థితి నెలకొంది. చెడిపోయిన కరెన్సీ నోట్లను మార్చుకునేందుకు వచ్చాం. బ్యాంకు ఉద్యోగులు ఆ నోట్లను స్వీకరించలేదు. అందుకే ఇలా నిరసనగా నోట్లను గాలిలోకి విసిరినట్లు కొంతమంది బాధిత వర్గాలు తెలిపారు.

నోట్ల మార్పిడి కౌంటర్ మూసివేత

ఈనెల 3వ తేదీ నుంచి చెడిపోయిన నోట్ల మార్పిడి కౌంటర్‌ను మూసివేసినట్లు బ్యాంకు అధికారులు తెలియజేసి వినియోగదారులను నచ్చజెప్పేందుకు విఫలయత్నం చేశారు. అయితే దీనికి సంబంధించి ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని ఖాతాదారులు వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి అదుపుతప్పింది. బ్యాంకు అధికారులు, ఖాతాదారుల మధ్య మాటల తూటాలు పేలడంతో పోలీసు సిబ్బంది ఘటనా స్థలాన్ని సందర్శించి ఆందోళనకారులను శాంతింపజేశారు. తడిసిన, చిరిగిన, మరియు పాడైన నోట్లను మార్చుకోవాలని మరియు నాణేలు, నోట్లను ప్రజల నుంచి లావాదేవీలు లేదా మార్పిడి కోసం స్వీకరించాలని ఇప్పటికే అన్ని బ్యాంకులకు సూచించినట్లు భారత రిజర్వ్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ అధికారి ఒకరు తెలిపారు. దీనికోసం ప్రజలు ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలను సంప్రదించాల్సిన అవసరం లేదన్నారు. ఈ వ్యవహారంలో ఖాతాదారులు, వినియోగదారులకు అసౌకర్యం లేకుండా బ్యాంకు వర్గాలు స్పందించాల్సి ఉంది.

క్లుప్తంగా

బీజేడీలోకి చేరికలు



పార్టీలో చేరినవారితో నెక్కంటి

రాయగడ: సదరు సమితి, మున్సిపాలిటీ పరిధిలో 910 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు బీజేడీలో బుధవారం చేశారు. బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు తన స్వగృహంలో నిర్వహించిన మిత్రణ పర్వం కార్యక్రమంలో భాగంగా వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేడీ పార్టీ మరింత బలోపేతమవుతోందని తెలియజేశారు. సీఎం నవీన్ పట్నాయక్ పాలనలో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. పాదయాత్ర సందర్భంగా పార్టీలోకి వలసలు పెరగడం విజయానికి సంకేతమని పేర్కొన్నారు. బీజేడీలో చేరినవారిలో లక్కీ బిడిక, కేశవ్ చంద్ర పాత్రో, సోమనాథ్ జకక, సుధేష్ మెలక, అర్జున్ కద్రక తదితరులు ఉన్నారు.

'సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: వీఓఏల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాడాలని వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు యానిమేటర్స్ వీఓఏలు శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం 36 గంటల ధర్నా మొదలుపెట్టారు. అంతకుముందు జ్యోతిబా పూలే పార్కు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని 250 మందిని అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు



కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం నిర్వహించారు. శ్రీకాకుళం దేవదాయ శాఖాధికారి బీవీజీఎస్ రవికుమార్ పరిశీలనలో గత 62 రోజులకుగాను ఆదాయం లెక్కించగా.. రూ.3,51,520లు వచ్చిందని ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి పాల్గొన్నారు.

ఇంటర్ త్రైమాసిక పరీక్షలు ప్రారంభం



ఓ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో క్వార్టర్లీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్యార్థుల త్రైమాసిక(క్వార్టర్లీ) పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 168 జూనియర్ కళాశాలల్లో ఈ పరీక్షలు మొదలయ్యాయి. తొలిరోజు తెలుగు/సంస్కృతం/హిందీ సబ్జెక్టులకు పరీక్షలు జరిగాయి. ఆయా సబ్జెక్టుల్లో ఒకే ప్రశ్న పత్రంతో విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 1.30 నుంచి 4.30 వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. 49490 మంది విద్యార్థులకు గాను 45వేల మంది వరకు ఈ పరీక్షలు రాసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ. కోట ప్రకాశరావు, ఆర్ఐఓ పి.దుర్గారావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

'ఆర్థిక స్వావలంబనే లక్ష్యం'



కొండచీపుర్ల ఉత్పత్తిని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

సంతబొమ్మాళి: స్వయం సహాయక సంఘ సభ్యులకు చేయూత అందించి ఆర్థిక స్వావలంబన చేయడమే లక్ష్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డాక్టర్ డి.విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నౌపడ పంచాయతీ సీతానగరంలో బుధవారం కొండచీపుర్లు ఉత్పత్తిదారులను సందర్శించి సభ్యులతో మాట్లాడారు. అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామ సంఘం ద్వారా అందించేందుకు వైఎస్ఆర్ కాంత్రి పథకం సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అప్పులు సకాలంలో తీరిస్తే ఎప్పుడు కావాలంటే అప్పుడు పెట్టుబడి అందిస్తారని అన్నారు.

అలంకార రూపిణి..!



గజలక్ష్మి రూపంలో కటక్ గొడొ చండీమాత



సరస్వతీ స్వరూపంలో పిరాపూర్ ధకులై అమ్మవారు



బొగొలా ముఖి సౌందర్యంతో ఝుంజిరి మంగళామాత



భువనేశ్వరి అలంకరణతో శోభిల్లిన గొడొగొడియా దక్షిణ కాళీమాత



రాజేశ్వరి మాతగా దర్శనమిచ్చిన చార నారాయణి అమ్మవారు

షోడశ దినాత్మక పూజలు పురస్కరించుకుని జగన్మాత పలు శక్తి పీఠాల్లో నిత్య నూతనంగా వెలుగొందుతోంది. రోజుకో అలంకరణతో భక్తులకు దర్శనమిస్తోంది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తుతున్నారు.

– భువనేశ్వర్



సరస్వతీ అలంకరణలో బంకి ముహాణొ రామచండీ దేవి



హరచండీ రూపంలో చవులియా గంజ్ జయ దుర్గామాత



మాతంగి శోభతో కటక్ చండీమాత దర్శనం

బావిలో పడిన పిల్లిని రక్షించబోయి..!

భువనేశ్వర్: పాడుబడిన బావిలో పడిపోయిన పిల్లిని రక్షించే ప్రయత్నంలో 50 ఏళ్ల వ్యక్తి నీటిలో మునిగి మరణించాడు. స్థానిక పటియా రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం ఈ విషాదం చోటు చేసుకుంది. మృతుడు శివ రామ్ సాహుగా గుర్తించారు. పటియా రైల్వేస్టేషన్ సమీపంలో దాదాపు 60 అడుగుల లోతైన పాడుబడిన బావిలో ఒక వ్యక్తి పెంపుడు పిల్లి పడిపోయింది. తన పెంపుడు పిల్లిని కాపాడుకునే ప్రయత్నంలో బావి లోపలికి స్థానికులు తాడుకు బిగించిన బకెట్‌ను గిరేసి ప్రయత్నిస్తుండగా శివ రామ్ సాహు అక్కడికి చేరాడు. పిల్లిని రక్షించేందుకు బావిలోకి దూకాడు. బావి లోపల ఊపిరాడక నీటిలో మునిగిపోయాడు. శివరామ్ సాహు మునిగిపోవడం చూసి పద్మకేశరీపూర్‌కు చెందిన శంకర్ దాస్ అతడిని రక్షించేందుకు బావిలోకి దూకాడు. అతను కూడా అదేవిధంగా ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. అనంతరం శివరామ్ బావిలో పడిపోయాడని స్థానికులు అతని అన్న భజమన్ సాహుకు సమాచారం అందించారు. సోదరుని రక్షించేందుకు తాడు సహాయంతో భజమన్ బావిలోకి వెళ్లాడు. అక్కడ ఊపిరాడని పరిస్థితిని పసిగట్టి సమయస్ఫూర్తితో బావిలోంచి బయటకు వచ్చేశాడు. ఇంతలో స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి అందరినీ రక్షించేందుకు సాయశక్తులా ప్రయత్నించారు. బావిలోంచి వ్యక్తులను బయటకు తీసుకొచ్చారు. కాగా అప్పటికే శివ రామ్ సాహు మృతి చెందారు. అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నంలో బయటపడిన మరో బాధితుడు శంకర్ దాస్‌ను పటియా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో చేర్చారు. ఆయనకు చికిత్స కొనసాగుతోంది. గంజాం జిల్లాకు చెందిన భజమన్ మరియు శివరామ్‌లు ఐస్ క్రీం అమ్ముతూ ఇక్కడ జీవనం సాగిస్తున్నారు.



బావిలో పడినవారిని రక్షించే ప్రయత్నం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలి



సమావేశంలో పాల్గొన్న వైద్యులు

జయపురం: మానసిక వ్యాధుల నిర్మూలనకు మందులతో పాటు ఆత్మ విశ్వాసాన్ని కలిగి ఉండాలని కొరాపుట్ జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణ కుమార్ పాడీ అన్నారు. మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మధ్యాహ్నం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోగులకు కేవలం డాక్టర్లు, వైద్య సిబ్బంది సేవలే కాకుండా రోగి కుటుంబ సభ్యుల సహకారం అవసరమన్నారు. అందరి కృషితో గత 5 నెలల్లో 917 మంది రోగులు ఆరోగ్యవంతులయ్యారని వెల్లడించారు. 'టెలిమానస్' కార్యక్రమం ద్వారా ఇంటిలో ఉండే అధిక రోగులు ఆరోగ్యవంతులు అయ్యారని పేర్కొన్నారు. 2024–25 సంవత్సరంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక వైద్య కేంద్రాల్లో మానసిక రోగులకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉన్నామని తెలియజేశారు. డాక్టర్ పాఢీ మాట్లాడుతూ.. జిల్లాలో మానసిక రోగులకు వైద్యం 2016–17 లో ప్రారంభమై, గత 7 ఏళ్లలో సంతృప్తికరమైన వైద్యం అందించడం జరిగిందన్నారు. ఈ ప్రయత్నంలో వైద్య సిబ్బంది భూమిక ప్రశంసనీయమని కొనియాడారు. అశాంతి, మానసిక రుగ్మత మొదలగు వాటి వలన ఆత్మహత్యలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. మానసిక రోగులకు ఆత్మహత్య సమాధానం కాదని, అటువంటి ఆలోచన వచ్చిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 11416 ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి అధికారి డాక్టర్ రామచంద్ర మహంతి, ప్రసూతి మహిళా వైద్యుడు డాక్టర్ దిలీప్ కుమార్ బిశ్వాల్, మానసిక రోగ వైద్య నిపుణుడు డాక్టర్ ఎ.నందిని తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనతోనే లక్ష్యాల సాధన

పాతపట్నం: విద్యార్థులు లక్ష్యాలు సాధించేందుకు అధ్యాపకులు శ్రమించాలని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ జిల్లా సమన్వయాధికారి బాలాజీ నాయక్ అన్నారు. పాతపట్నం ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా అకడమిక్ ఆడిట్ టీమ్‌తో బుధవారం ఉపాధ్యాయుల విద్యా బోధన తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదిలో విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థులకు సంతృప్తి పరిచే విధంగా బోధన ఉండాలన్నారు. ఉపాధ్యాయులను పనితీరు, రికార్డు వర్క్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో దుప్పలవలస, కొల్లివలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్స్ డి.దేవేంద్ర, ఎన్.రామకృష్ణలు, కె.రామమూర్తి, ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణతార, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాతపట్నం గురుకులంలో ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలిస్తున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ జిల్లా సమన్వయాధికారి బాలాజీ నాయక్

కల్వర్టును ఢీకొన్న లారీ

టెక్కలి రూరల్: మాకవరం గ్రామ సమీప జాతీయ రహదారిపై బుధవారం వేకువ జామున లారీ కల్వర్టును ఢీకొట్టింది. ప్రమాదంలో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస నుంచి రాజమండ్రి వైపు కూల్ డ్రింక్స్ లోడుతో వెళ్తున్న లారీ బుధవారం వేకువజామున టెక్కలి సమీప మాకవరం గ్రామం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ప్రమాదంలో బండి ముందు భాగం నుజ్జునుజ్జు అయిపోయింది.

వరి కోతలు మొదలు



యంత్రాలతో వరికోత చేపడుతున్న దృశ్యం

సారవకోట: మండలంలోని బుడితి జంక్షన్ సమీపంలో వరి కోతలు అప్పుడే ప్రారంభమయ్యాయి. వంశధార కాలువకు పక్కనే ఉన్న పంట పొలాల్లో వరినాట్లు త్వరగా ప్రారంభించారు. పంట త్వరగా చేతికి రావడంతో ప్రస్తుతం జగనన్న యంత్రా సేవా పథకం ద్వారా అందించిన యంత్రాలను వినియోగించి వరి పంట కోత చేపడుతున్నారు.

మనోవేదనతో వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని డీసీసీబీ కాలనీకి చెందిన ఓ వివాహిత జూలైలో అదృశ్యమైనట్లు తన భర్త బుధవారం ఫిర్యాదు చేశారని రెండో పట్టణ ఎస్ఐ నాగిరెడ్డి లక్ష్మణ రావు పేర్కొన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. నరసన్నపేట ఎండోమెంట్ విభాగంలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న ముద్దాడ శ్రావణి, తన భర్త దిబ్బా సురేష్‌తో కలిసి డీసీసీబీ కాలనీలో ఉంటున్నారు. వీరికి వివాహమై పిల్లలు లేరు. దీంతో ఆమె నిరంతరం మనోవేదనకు గురవుతూ ఉండేవారు. ఉద్యోగంలో సైతం ఒత్తిడికి గురయ్యేవారు. ఇదే క్రమంలో ఓ సారి ఎవరికీ చెప్పకుండా ఇంటిని వదిలిపెట్టి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చారు. వచ్చాక కూడా ఇంటిలో ముభావంగానే ఉండేవారు. ఈ క్రమంలో జూలై 25న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిందని, మళ్లీ తిరిగి రాలేదని, ఎంత గాలించినా లాభం లేకపోవడంతో బుధవారం రాత్రి ఆమె భర్త దిబ్బా సురేష్ రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ కె.లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మర్యాదపూర్వక భేటీ



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో ప్రముఖ వికాస్ ఖన్నా బుధవారం సీఎం నివాసంలో భేటీ అయ్యారు. వికాస్ ఖన్నా న్యూయార్క్ వీధుల్లో రాష్ట్ర కళాఖండాల నమూనా ఆవిష్కరించడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో కోణార్క్ ఆలయ చక్రం ప్రతిరూపాన్ని వికాస్ ఖన్నా ఇటీవల ఆవిష్కరించారు. అత్యంత ప్రేక్షకాదరణ పొందిన మాస్టర్ చెఫ్ బుల్లి తెర కార్యక్రమంలో రాష్ట్ర వంటకాల రుచుల ప్రదర్శన, ప్రసారంతో జాతీయ, అంతర్జాతీయ ప్రేక్షకుల నోరూరింపజేయడం మరో విశేషంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఒడిశా అపురూప శాశ్వతమైన కోణార్క్ చక్రం శిల్పాన్ని విస్తృతంగా ప్రేక్షకుల దృష్టికి తీసుకు వెళ్లడం అత్యంత ఆనందదాయకమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఒడియా రుచికరమైన వంటకాలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని వికాస్ ఖన్నాను ముఖ్యమంత్రి ప్రోత్సహించారు.

- భువనేశ్వర్

విజేతలకు సత్కారం



అమిత్ రోహిదాస్‌కు చెక్ అందజేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



దీప్ గ్రేస్ ఎక్కాకు చెక్ అందజేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో పతకాలు సాధించి సగర్వంగా రాష్ట్రానికి తిరిగి వచ్చిన బంగారు, కాంస్య పతకాల విజేతలను సీఎం నవీన్ పట్నాయక్ బుధవారం ప్రత్యేకంగా సత్కరించి ప్రోత్సహించారు. బంగారు పతాకం విజేత అమిత్ రోహిదాస్ మరియు కాంస్య పతాక విజేత దీప్ గ్రేస్ ఎక్కాకు ముఖ్యమంత్రి నగదు పురస్కారం చెక్‌లను బహూకరించారు.

డ్రెస్‌కోడ్ అమలుకు అభ్యర్థన

భువనేశ్వర్:

పూరీ జగన్నాథ ఆలయంలో భక్తులకు డ్రెస్ కోడ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటన తర్వాత స్థానిక ఏకామ్ర క్షేత్రం లింగరాజు ఆలయంలో స్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు డ్రెస్ కోడ్ నిబంధన అమలు చేయాలని సేవాయత్ వర్గం అభ్యర్థిస్తోంది. ఆలయానికి వచ్చే భక్తులకు డ్రెస్ కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలన్న శ్రీజగన్నాథ ఆలయ పాలక వర్గం (ఎస్‌జేటీఏ) నిర్ణయాన్ని లింగరాజ్ ఆలయం బ్రాహ్మణ నియోగుల సంఘం స్వాగతించింది. ఈ సంఘం కార్యదర్శి బిరాంచి నారాయణ్ పతి మాట్లాడుతూ ఇదే విధానం లింగరాజు ఆలయంలో ప్రవేశ పెట్టాలని ప్రతిపాదించారు. కొంతమంది భక్తులు అసభ్యకరమైన దుస్తులు ధరించడం ద్వారా ఆలయ పవిత్రతను మరియు మర్యాదలను గౌరవించడం లేదన్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక, ధార్మిక పర్యావరణం కలుషితం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో లింగరాజు ఆలయం పాలక మండలి బలమైన చర్య తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.



లింగరాజు దేవస్థాన సముదాయం

క్లుప్తంగా

అలరించిన చిన్నారుల భరత నాట్యం



భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో బుధవారం చిన్నారులు ప్రదర్శించిన భరత నాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా విజయనగరం పట్టణంలోని వైష్ణవి కళాక్షేత్రం బృందానికి చెందిన పలువురు చిన్నారులు వివిధ భక్తి పాటలకు సంప్రదాయబద్ధంగా నృత్యం చేశారు. చిన్నారులను దేవస్థాన ఈఓ కిశోర్ కుమార్ అభినందించి ధర్మపథం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు సచివాలయం ఉద్యోగి



జాతీయ పోటీలకు ఎంపికైన శంకరరావు

నెల్లిమర్ల: ఈ నెల 16నుంచి ఢిల్లీలో జరగబోయే అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ పోటీలకు రాష్ట్ర సివిల్ సర్వీస్ ఉద్యోగుల తరపున జిల్లాలోని మొయిద సచివాలయం ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కాళ్ల శంకర రావు ఎంపికయ్యారు. ఆయన విజయవాడలో జరిగిన సివిల్ సర్వీస్ ఉద్యోగుల పోటీల్లో ప్రతిభ కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శంకర రావును ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్‌బాబు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, మొయిద, పూతికపేట సర్పంచులు అట్టాడ కృష్ణ, లెంక మంగమ్మ, ఎంపీటీసీ పెనుమత్స సంతోష్ బాబు అభినందించారు.

జాతీయ పోటీలకు ఎంపికైన పీఈటీ



జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికైన రఘుమండ పీఈటీ భాను

డెంకాడ: అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు మండలంలోని రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయిని కుర్మాన భాను ఎంపికయ్యరు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పీఈటీ భాను ప్రతిభ కనబరచడంతో ఆమెను కమిటీ ఎంపిక చేసింది. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకూ ఢిల్లీలో జరగబోయే అఖిల భారత ప్రభుత్వ మహిళా కబడ్డీలో రాష్ట్ర జట్టు తరపున ఆమె ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా పీఈటీ భానును హెచ్‌ఎం సౌభాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు, రేపు జీఎల్ పురంలో ఎస్టీ కమిషన్ పర్యటన

పార్వతీపురం: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు గుమ్మలక్ష్మీపురం మండలంలో గురు, శుక్రవారాలలో పర్యటిస్తారని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11.45గంటలకు ఆయన ఇక్కడికి చేరుకుని అధికారులతో సమావేశం, గిరిజనులు, గిరిజన సంఘాల నాయకుల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. రాత్రి గుమ్మలక్ష్మీపురంలో బస చేసి శుక్రవారం ఉదయం గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తారని వివరించారు.

టిన్నర్ తాగిన బాలుడికి అస్వస్థత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గుమ్మ గ్రామానికి చెందిన మూడేళ్ల కె.సాత్విక్ బుధవారం పెయింటింగ్‌లో కలిపే టిన్నర్ తాగి అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా, పరీక్షించిన వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్య సేవల నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామానికి చెందిన ముదిలి సూర్యనారాయణ(48) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మద్యం వ్యసనానికి బానిసగా మారిన సూర్యనారాయణను మద్యం తాగవద్దని మంగళవారం రాత్రి భార్య పోలమ్మ మందలించడంతో మనస్తాపం చెందిన పురుగు మందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య పోలమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని, మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిన తరువాత కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

గిరిజనులకు అండగా ఐటీడీఏ

- గిరిజన ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరాలి
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజనులు పండించే పంటలు, ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌లో విక్రయాలు జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్ ఆకాంక్షించారు. ఈ మేరకు స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో బుధవారం జరిగిన గిరిజన కళాకారుల ఉత్పత్తుల మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు పండించే పంటలు, ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉందని, అయితే దళారులు, మధ్యవర్తుల ద్వారా సరైన ధర పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకోసం వన్‌ధన్ వికాస్ కేంద్రా(వీడీవీకే)లను జిల్లాలో ఏర్పాటుచేసి గిరిజన ఉత్పత్తులు మంచి ధరకు విక్రయించేలా చేసినట్లు చెప్పారు. తద్వారా తమ పంటలు, ఉత్పత్తులకు అధిక లాభాలను ఆర్జించి, ఆర్థికంగా, సామాజికంగా గిరిజనులు ఎదిగేందుకు దోహదపడు తున్నట్లు తెలిపారు.

వీడీవీకేలకు ప్రోత్సాహం

జిల్లాలో 54 వరకు వీడీవీకేలు ఉండగా, అందులో 34 మాత్రమే పనిచేస్తున్నాయని చెప్పారు. గిరిజనుల ఉత్పత్తుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివిధాలా సహకరిస్తున్నప్పటికీ కొన్ని వీడీవీకేలు పనిచేయడం లేదని, వాటిపై అవగాహన పెంపొందించుకొని సంపూర్ణంగా వినియోగించుకునేలా చేయడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. వీడీవీకేలను ప్రోత్సహించేందుకు ఒక్కో గ్రూపు సభ్యులకు రూ.లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని, తద్వారా అధిక లాభాలను ఆర్జించాలన్నదే తమ ధ్యేయమని వివరించారు. అవసరమైతే మరిన్ని నిధులను వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, గిరిజన ఉత్పత్తులకు రాష్ట్రంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలని అభిలషించారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని ట్రైఫెడ్ అందజేస్తుందని తెలిపారు. గిరిజనులకు అండగా ఐటీడీఏ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ వీడీవీకేలు ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో ట్రై ఫెడ్ ప్రాంతీయ మేనేజర్ ఎస్.శ్రీనివాస్, ఐటీడీఏ ఏపీఓ పి.మురళీధర్, గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్, ఏపీడీ వై.సత్యనారాయణ, వివిధ వీడీవీకేల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం



అగరబత్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైఫెడ్ ఆర్‌ఎం శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామని ట్రైఫెడ్ ఆర్‌ఎం శ్రీనివాస్ సాంకి అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మండలంలోని అడారు గ్రామంలో అగర బత్తుల తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి అన్ని రకాలుగా సహాయసహకారాలు అందిస్తున్నామని చెప్పారు. అగరబత్తుల తయారీకి అవుతున్న ఖర్చు, ఆదాయం, మార్కెటింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమకు వస్తున్న ఆదాయం మరింత పెంచేందుకు గిరిజన మహిళలకు సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. గిరిజనులు దళారుల చేతులో మోసపోకుండా పూర్తి చర్యలు చేపట్టామని, అందులో భాగంగా చిన్న పాటి పరిశ్రమల అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ వై. సత్యంనాయుడు, వెలుగు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ నాగలక్ష్మి
- ఎల్.కోటలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం



అర్జీదారుల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్కవరపుకోట: అర్జీదారుల సమస్య పరిష్కారమే లక్ష్యంగా, అన్ని శాఖలు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఫిర్యాదుదారులు శతశాతం సంతృప్తి చెందేవిధంగా వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ మేరకు లక్కవరపుకోట మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారులు అందజేసిన 76 వినతులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి దూర ప్రాంతాల వారు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో మండల స్థాయి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వచ్చిన వినతులపై తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌హెచ్‌ఓ సంయుక్తంగా చర్చించి సమగ్రంగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎంవీ సూర్యకళ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మండల ప్రత్యేకాధికారి ఎస్.శారదాదేవి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ముగ్గురి ఎంపిక



శనపతి గురునాయుడు



శనపతి పల్లవి



చుక్కా శ్రీలక్ష్మి

నెల్లిమర్ల రూరల్: గోవాలో త్వరలో జరగబోయే జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు వెయిట్ లిఫ్టర్లు ఎంపియ్యారు. నెల్లిమర్ల మండలంలోని చంద్రంపేట గ్రామానికి చెందిన శనపతి గురునాయుడు 55 కేజీల విభాగంలో, కొండవెలగాడకు చెందిన శనపతి పల్లవి 64 కేజీల విభాగంలో, చుక్కా శ్రీలక్ష్మి 81 కేజీల విభాగంలో ఎంపికైనట్లు సంబంధిత కోచ్‌లు బుధవారం వెల్లడించారు. ఎంపికైన వారికి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

సయ్యద్ ముస్తాఖ్ అలి టోర్నీకి ముగ్గురు జిల్లా క్రికెటర్ల ఎంపిక



పిన్నింటి తపస్వి

విజయనగరం రూరల్: భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే సయ్యద్ ముస్తాఖ్ అలీ టీ- 20 దేశవాళీ క్రికెట్ టోర్నీకి జిల్లా నుంచి ముగ్గురు క్రికెటర్లు ఎంపికయ్యారని విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు బుధవారం తెలిపారు. ఇటీవల ఏసీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన టీ-20 క్రికెట్ టోర్నీలో అద్భుతంగా రాణించిన పిన్నింటి తపస్వి, ధీరజ్‌కుమార్, యర్రా పృథ్వీరాజ్‌లు రాష్ట్ర జట్టులో చోటు సంపాదించారని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, సెలెక్టర్లు, కోచ్‌లు, క్రీడాకారులు అభినందించారు.

ఆడపిల్లల పట్ల వివక్ష తగదు

- జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి అచ్యుత కుమారి

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లల పట్ల వివక్ష తగదని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ అచ్యుతకుమారి తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఆడపిల్లను రక్షిద్దాం, ఆడపిల్లలను కాపాడదాం అను అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నాయన్నారు. తక్కువ వయసులో గర్భం దాల్చడం వల్ల ప్రసవ సమయంలో ఇబ్బంది పడతారని చెప్పారు. బాలికల హక్కుల గురించి వారికి తెలియజేయాలని సూచించారు. సమాజంలో బాలికల అసమానతలను తొలిగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెమో చిన్నతల్లి, పి.రత్నం, డిప్యూటీ డెమో రమణ, హెల్త్ ఎడ్యుకేటర్ చాముండేశ్వరి, కన్సల్టెంట్ పవన్ ఆశిష్, నేచర్ సంస్థ ప్రతినిధి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌కు మానవసేవా పురస్కారం



సత్కారం పొందుతున్న మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంట జనార్దననాయుడు దంపతులు

విజయనగరం అర్బన్: గుంటూరుకు చెందిన పబ్బరాజు వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి స్మారక మానవ సేవా పురస్కారం-2023వ సంవత్సరానికి గాను విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంట జనార్దన నాయుడు అందుకున్నారు. ఈ మేరకు గుంటూరులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు పురస్కారాన్ని జనార్దననాయుడు దంపతులకు అందజేసి సత్కరించారు. అంధులు, దివ్యాంగులు, అనాథల సేవలో నిమగ్నమైన వ్యక్తులకు గానీ, సంస్థలకు గానీ దివ్యాంగులై ఉండి విద్యావంతులై ఉన్నత ఉద్యోగం పొంది ఉత్తమ పని తీరు ప్రదర్శించిన ఒక్కొక్కరికీ లక్ష రూపాయలు చొప్పున ప్రతి సంవత్సరం బహూకరించాలనే పబ్బరాజు వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ సంకల్పం మేరకు సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌ను పురస్కారానికి ఎంపిక చేశారు. డాక్టర్ జనార్దన నాయుడు పుట్టుకతో అంధుడైనప్పటికీ జీవితంలో ఎదగడానికి అంగవైకల్యం అవరోధం కాదని నిరూపించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా సుదీర్ఘకాలం పనిచేసి పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఇటీవల బదిలీపై మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది జనార్దననాయుడిని అభినందించారు.

12న ఫెన్సింగ్ సీనియర్స్ జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ స్త్రీ, పురుషుల ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక ఈనెల 12న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డీవీ చారిప్రసాద్ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి నగర శివారులో గల విజ్జీ స్టేడియం ప్రాంగణంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఐడీ కార్డు కలిగి ఉండి, ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు మాత్రమే ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా తెలిపారు. క్రీడాకారులు విధిగా సొంత క్రీడా సామగ్రితో పాటు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈనెల 14,15 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు ఫోన్ 83747 37707 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి

విజయనగరం అర్బన్: తక్కువ వయస్సులోనే వివాహాలు చేస్తున్న సమస్య జిల్లాలో అధికంగా ఉందని దీనిని నివారించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సమష్టిగా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ పేర్కొన్నారు. బాల్య వివాహాలపై కైలాస్ సత్యార్థి ఫౌండేషన్‌కు చెందిన భువన్ రిభు రచించిన వెన్ చిల్డ్రన్ అనే పుస్తకాన్ని కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధానికి కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, యూత్ క్లబ్ బెజ్జిపురం డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, కోశాధికారి జి.అప్పలనాయుడు, కార్యవర్గ సభ్యులు ఐ.విశ్వనాథం, ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త జి.ఝాన్సీరాణి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ గోవిందరావు పాల్గొన్నారు.

16 నుంచి ఈవీఎంల తనిఖీ

- రెండు రోజుల్లో రాజకీయ పార్టీ ప్రతినిధులను నామినేట్ చేయాలి
- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి 20 రోజుల పాటు ఈవీఎంల మొదటిదశ తనిఖీ జరుగుతుందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే కార్యక్రమం పరిశీలనకు జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పక్షాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయాలని కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పక్షాల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ సూర్యనారాయణ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఎఫ్ఎల్‌సీ కోసం ఎన్నికల కమిషన్ నిర్దేశిత లే అవుట్‌ను డిజైన్ చేసిందన్నారు. ఈవీఎంల తనిఖీ ప్రక్రియకు పార్టీల ప్రతినిధులు ఐడీకార్డులతో హాజరు కావాలని కోరారు. ఈ ప్రక్రియ మొత్తం వెబ్‌కాస్టింగ్ ద్వారా లైవ్‌లో ఎన్నికల కమిషన్ పరిశీలిస్తుందని తెలిపారు. సీసీ కెమెరాల్లోనూ రికార్డు అవుతుందన్నారు. సమావేశంలో జేసీ కె.మయూర్‌అశోక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, వెంకటేశ్వరావు, పద్మలత, సుదర్శన దొర, నూకరాజు, ఎన్నికల డీటీలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న బయిరెడ్డి హరి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ హెచ్‌ఎం జీఎస్ఆర్ మూర్తి, పీడీ సత్యానంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎల్‌వీ రమణలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఇటీవల నిర్వహించగా అందులో పాల్గొన్న విద్యార్థి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 30 నుంచి చిత్తూరులో జరగనున్న పోటీల్లో జిల్లా జట్టులో పాల్గొనడానికి అర్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అండర్-19 త్రోబాల్, హాకీ జట్ల ఎంపిక పూర్తి



హాకీ పోటీలకు ఎంపికైన జిల్లా బాలికల జట్టు



త్రోబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 బాల, బాలికల త్రోబాల్, హాకీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు బుధవారం పూర్తయ్యాయి. అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. ఇరు క్రీడాంశాలకు సంబంధించి 150 మంది క్రీడాకారులు హాజరు కాగా.. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న త్రోబాల్ పోటీలకు 12 మంది బాలురు, 12 మంది బాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. అలాగే ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విశాఖ జిల్లా చోడవరంలో జరగనున్న హాకీ పోటీలకు 16 మంది బాలికలు, 16 మంది బాలురుతో కూడిన జట్లను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి పీఎల్ఎన్ కృష్ణ తెలిపారు. ఎంపిక పోటీలను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

జూడో పోటీల్లో ఆరికతోట విద్యార్థుల ప్రతిభ



జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలలో ఈ నెల 10వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి జూడో పోటీల్లో ఆరికతోట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.నాలుగో కేటగిరి అండర్ 14లో మైనస్ 40 కేజీల విభాగంలో పి.ప్రేమ్ సాగర్, మైనస్ 30 కేజీల విభాగంలో టి.సంతోష్ ప్రతిభ కనబరచగా,అండర్ 17లో మైనస్ 40 కేజీల విభాగంలో జి.లక్ష్మణరావు, మైనస్ 50 కేజీల విభాగంలో వి.చిన్న యోగానందనాయుడు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వి.అప్పలనాయుడు తెలిపారు. వీరంతా ఈ నెల 28,29,30 తేదీల్లో అనంతపురం జిల్లా చెగిచర్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం జీవీఎస్ ప్రసాదరావు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు అనురాధ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆ ఆత్మహత్యను సాధారణ మరణంగా చిత్రీకరించేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. దీనిపై బుధవారం ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. బొబ్బిలి సమీపంలోని పక్కి ప్రాంతానికి చెందిన డర్రు అనురాధ (25)కు పార్వతీపురం సమీపంలో నందివానివలస ప్రాంతానికి చెందిన కుప్పిలి బాబాజీతో ఏడేళ్ల కిందట వివాహమైంది. వీరు ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టులో కొత్తూరు డివిజనల్‌లో రిసోర్సు పర్సన్లుగా పనిచేస్తున్నారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో అనురాధ ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు సర్ది చెప్పి మళ్లీ కాపురానికి పంపించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మళ్లీ భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భర్త ఇంటిలో లేని సమయం చూసి ఆమె పురుగుల మందు తాగేశారు. బాబాజీ ఇంటికి వచ్చి చూసే సరికి ఆమె అపస్మారక స్థితిలో ఉండడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతుండగానే.. తన భార్య అస్వస్థతకు గురైందని, పార్వతీపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువస్తున్నానని బాబాజీ అనురాధ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆ ఆస్పత్రికి వద్దకు చేరుకున్నారు. అంబులెన్స్ నుంచి దించే సరికి అనురాధ మృతి చెంది ఉంది. దీంతో వారికి అనుమానం వచ్చి బాబాజీని ప్రశ్నించగా.. దారిలో చనిపోయిందని చెప్పాడు. ఈ ఘటన కుశాలపురంలో జరగటం వల్ల ఈ లిమిట్స్‌కు చెందిన పోలీస్ స్టేషన్‌లో మృతురాలి తల్లి సూరమ్మ, అన్న శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు ఎస్ఐ సత్యానారాయణ తెలిపారు. అనంతరం ఆ ఫిర్యాదు మేరకు సమగ్ర దర్యాప్తు చేస్తామన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు మాత్రం భర్త వేధింపుల వల్లనే ఆమె చనిపోయిందని ఆరోపిస్తున్నారు.

బాలికల హక్కుల పరిరక్షణకు పాటు పడదాం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్



ర్యాలీని ప్రారంభిస్తున్న బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు

విజయనగరం ఫోర్ట్: బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కోట దగ్గర ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి కోసం ప్రత్యేకంగా రుపొందించిన చట్టాలు, పథకాలను, పర్యవేక్షిస్తే అమలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బాలికలకు పూర్తి స్థాయిలో విద్య, ఆరోగ్యం కోసం ప్రభుత్వం అధిక నిధులను ఖర్చు చేస్తోందని చెప్పారు. సమాజంలో బాలికలను అన్ని రంగాల్లో భాగస్వామ్యం చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికలు అపరిచిత వ్యక్తులతో పరిచయం చేసుకోకూడదని హితవు పలికారు. సామాజిక మాధ్యమాలకు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని కోరారు. ఏర్పరచుకున్న లక్ష్యాలను సాధించడానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటర్‌మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఆదినారాయణ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు యాళ్ల నాగరాజు, వెన్నల సంధ్య, కెంగువ జయలక్ష్మి, రెడ్డి సరస్వతి, తవిటినాయుడు, వెంకటరావు , వన్‌స్టాప్ అడ్మినిస్ట్రేటర్ విజయలక్ష్మి, చైల్డ్‌లైన్ సిబ్బంది అరుణ్, అనిల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సౌకర్యాల కల్పన



ఎస్.కోటలోని జగనన్న కాలనీను పరిశీలిస్తున్న రాష్ట్ర హౌసింగ్ ప్రత్యేకాధికారి దివాన్‌మైదీన్

శృంగవరపుకోట: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయల ఖర్చుతో ప్రభుత్వం దశలవారీగా సౌకర్యాలు కల్పిస్తోందని ఏపీ గృహనిర్మాణశాఖ ప్రత్యేకాధికారి దివాన్ మైదీన్ తెలిపారు. హౌసింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులోని జగనన్న లేఅవుట్‌ను బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. రోడ్లు, తాగునీరు, కాలువలు, విద్యుత్ తదితర సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి పేదకుటుంబాన్ని సామాజికంగా, ఆర్థికంగా మంచి స్థితిలో ఉంచాలన్నదే ప్రభుత్వ యోచనగా పేర్కొన్నారు. ఎస్.కోట లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాల తీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ చినబాబు, వీఆర్వోలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.